సాక్షి పెద్దపల్లి

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



మంత్రి ప్రత్యేక పూజలు

ధర్మారం: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ-2 జీఎం

గోదావరిఖని: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను శుక్రవారం ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్య నారాయణ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి ప్రారంభం



ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో శుక్రవారం యూరియా ఉత్పత్తి ప్రారంభించారు. ఈనెల 1న కర్మాగారంలో హీటర్ స్టీమ్ పైప్‌లైన్‌లో సమస్యతో ప్లాంట్‌ను అధికారులు వారం రోజులపాటు షట్‌డౌన్ చేశారు. దీంతో కర్మాగారంలో ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతుల అనంతరం కర్మాగారాన్ని ప్రారంభించారు. ప్లాంట్ పునరుద్ధరించిన 24 గంటల అనంతరం యూరియా ఉత్పత్తి ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్‌కు చెప్పక్కా.. కవితక్క..



ఎమ్మెల్సీ కవిత చిత్రపటం వద్ద వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించేలా సీఎం కేసీఆర్‌కు చెప్పక్కా.. కవితక్క అంటూ మహిళా ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్సీ కవిత చిత్రపటం ఎదుట వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. తమను కూడా బిడ్డవలె చూసుకునే బుద్ధిని ప్రసాదించాలంటూ ప్రసాద, నైవేద్యాలు, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించి వాయినాలు ఇచ్చుకున్నారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సురేంద్రకుమార్, రాజయ్య, సంపత్‌రావు, వెంకటేశం, సుధాకర్, రవిరాజ్, మల్లయ్య, శ్రీధర్, రమేశ్, శ్రీలత, శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్, రహీం తదితరులు పాల్గొన్నారు.

పురావస్తు శాఖ స్థలాన్ని కాపాడాలి



పెద్దబొంకూర్‌లో పురావస్తు శాఖ స్థలాన్ని పరిశీలిస్తున్న శైలజారామయ్యర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామశివారులోని పురావస్తు శాఖ స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు.. యూత్, టూరిజం ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం ఆమె పురావస్తు స్థలాన్ని పరిశీలించారు. చారిత్రక నేపథ్యమున్న స్థలాన్ని కాపాడాలని, రాజీవ్‌రోడ్డును ఆనుకుని ఉన్న విలువైన పురావస్తు శాఖ స్థలం ఆక్రమణకు గురవుతోందని, ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పెద్దబొంకూర్ మాజీ ఎంపిటీసీ కారుపాకల సంపత్‌కుమార్, పంచాయతీ పాలకమండలి సభ్యులు శైలజారామయ్యర్‌కు వివరించారు. పురావస్తు శాఖ స్థలం చుట్టు ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆమె వెంట మిట్టపల్లి నరేశ్, సంపత్, పోల్‌రాజ్ తదితరులున్నారు.

ఆడ బిడ్డను ఆశీర్వదించండి



మద్దతు కోరుతున్న సంధ్యారాణి

గోదావరిఖని(రామగుండం): రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటున్న ఆడ బిడ్డను ఆశీర్వదించాలని జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి కోరారు. శుక్రవారం గోదావరిఖని లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ వ్యాపారస్తులను కలిసి మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేకుండా నిజాయితీగా ప్రజలకు సేవలందించానని, రాబోయే రోజుల్లో ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహిళా అభ్యర్థిగా ఒకసారి అవకాశం కల్పించాలని వ్యాపారస్తులను కోరారు. ఆమె వెంట ప్రియ, రేఖ, వాసవి, కృష్ణవేణి, మల్లేశ్వరి, శైలజ, విజయ, సౌజన్య, భారతి, హేమ తదితరులున్నారు.

పౌరసేవలు అంతంతే..



రామగుండం కార్పొరేషన్ కార్యాలయం

- కొత్త మున్సిపాలిటీల్లో అవగాహన లేక కానరాని స్పందన
- పలు చోట్ల ఆన్‌లైన్ ఫిర్యాదులకు పరిష్కారం కరువు

సాక్షి, పెద్దపల్లి: బల్దియాల్లో నిబంధనల మేరకు పౌర సేవలు అందడం లేదు. ఐదేళ్ల క్రితం సిటిజన్ బడ్డీయాప్‌ను అందుబాటులోకి తెచ్చినా మున్సిపాలిటీల్లో పౌరసేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు, వీధి దీపాలు, రోడ్లు, చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, ఆస్తి పేరు మార్పిడి, నల్లా కనెక్షన్, జనన, మరణ ధ్రువపత్రాలు, భవన నిర్మాణం, వ్యాపార లైసెన్స్ పునరుద్ధరణ, లే అవుట్ అనుమతులు వంటి అనేక సేవలు, సమస్యలు ఏవైనా కార్యాలయానికి రాకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిటిజన్ బడ్డీయాప్, మున్సిపాలిటీ పోర్టల్‌ను తీసుకొచ్చింది. బల్దియాల్లో నెలకొన్న సమస్యలు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు అక్రమాలకు చెక్ పెడుతూ పారదర్శక పాలన అందించటమే లక్ష్యం. వినియోగంలోకి తీసుకొచ్చిన మొదట్లో ఫిర్యాదులు అందగా వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించేవారు. అనంతరం వాటిపై అధికారులు, సిబ్బందికి పట్టింపు కరువవడంతో ప్రజా సమస్యలు పట్టించుకునే వారు కరువయ్యారు. సిటిజన్ ఛార్టర్ సేవలపై క్షేత్రస్థాయిలోనూ ప్రచారం కొరవడింది. దీంతో ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది. కొందరు విద్యావంతులు ఆన్‌లైన్‌లో వినతులు ఇస్తున్నా అధికారులు వాటిని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఏర్పడిన కొత్త మున్సిపాలిటీల్లో పౌరసేవలపై అవగాహన లేక ఫిర్యాదులు అంతంతగానే అందుతున్నాయి. మంథని, సుల్తానాబాద్, పెద్దపల్లిలో సగటున రోజుకు ఒకట్రెండు ఫిర్యాదులు రావడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది.

మున్సిపాలిటీల వారీగా ఈ ఏడాదిలో వచ్చిన దరఖాస్తులు

బల్దియా	వచ్చిన దరఖాస్తులు	పరిష్కారమైనవి
రామగుండం	958	716
పెద్దపల్లి	72	58
మంథని	24	18
సుల్తానాబాద్	22	18

ఇలా ఫిర్యాదు చేయవచ్చు

- గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి సిటిజన్‌బడ్డీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మున్సిపాలిటీ పేరు నమోదు చేసిన తర్వాత సమస్యను పూర్తి వివరాలతో టైప్ చేయాలి. అధికారులు వాటిని పరిశీలించిన తర్వాత సమస్యను బట్టి 7 నుంచి 30 రోజుల్లోపు పరిష్కరిస్తారు. సిటిజన్ ఛార్టర్ కింద చెత్త నిల్వ, సేకరణలో ఇబ్బందులపై ఒకరోజు, వీధి దీపాల సమస్యపై ఫిర్యాదు అందిన అదే రోజు, రోడ్డు సమస్యలపై వారం రోజులు, గుంతలు పూడ్చేందుకు ఒక రోజు, తాగునీటి సరఫరాలో లోపాలపై రెండు రోజులు, ఇంటి నిర్మాణ అనుమతులపై గరిష్టంగా 30 రోజుల్లో స్పందించాల్సి ఉంటుంది.

అవగాహన శూన్యం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్యం ఘనంగా ఉన్నా ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొదట యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఫోన్ నంబర్, ఇతర వివరాలు, సమస్య ఫొటోను నమోదు చేయాలి. ఈయాప్‌లో ఆస్తిపన్ను చెల్లింపు, సంబంధింత వార్డులవారీగా అధికారులు, సిబ్బంది జాబితా, ప్రకటనలు, సలహాలు, సూచనలు తదితర విషయాలను పొందుపర్చారు. ప్రజలకు అవగాహన కల్పించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చొరవ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా యాప్ గురించి అవగాహన కల్పించి, లక్ష్యం దిశగా చర్యలు తీసుకోవాలి.

పరిష్కారంపై దృష్టిసారిస్తాం



ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందిస్తున్నాం. బడ్డీయాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను రోజూ పరిశీలించి వెంటనే సంబంధిత విభాగాల అధికారులు పరిష్కారం నిమిత్తం పంపుతున్నాం. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తాం.

– త్రియంబకేశ్వర్‌రావు, డిప్యూటీ కమిషనర్, రామగుండం

పట్టించుకోవడం లేదు



టీచర్స్ కాలనీ ప్రాంతం అస్తవ్యస్తంగా మారింది. సమీప కాలనీల్లోని మురుగు నీరంతా టీచర్స్ కాలనీ దగ్గర్లో నిలిచిపోతుంది. దోమలు, ఈగలు పెరిగాయి. సరైన రహదారి లేదు. ఈ సమస్యపై అనేకసార్లు నేరుగా, ఆన్లైన్‌లో కూడా ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. బడ్డీయాప్‌లో అండర్ ప్రాసెస్ అని చూపిస్తోంది. అధికారులు ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి.

– రుద్రభట్ల శంకర్, గోదావరిఖని

సీటీ స్కాన్ ఏర్పాటు చేయిస్తా

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- జిల్లా ప్రభుత్వాసుపత్రి, మాతాశిశు కేంద్రం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని డయాగ్నస్టిక్ హబ్‌లో సీటీ స్కాన్ ఏర్పాటుకు ప్రతిపాదనలిచ్చామని, త్వరలో ఏర్పాటవుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి, మాతాశిశు ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతాశిశు కేంద్రంలో అందుతున్న సేవలపై పలువురిని అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్ సేవల కోసం పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తున్నవారికి టోకెన్లు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన సేవలందిస్తున్నామని, ప్రజలంతా వినియోగించుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఉన్న పరిస్థితిని సూపరింటెండెంట్ రమాకాంత్ వివరించారు. ఆర్ఎంఓ శౌరయ్య తదితరులున్నారు.

ఈవీఎం గోదాంల పరిశీలన

పెద్దపల్లి తహసీల్దార్ ఆఫీసు ఆవరణలోని ఈవీఎం గోదాములను శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు ఉన్న గిడ్డంగిలోకి ఎవరినీ అనుమతించొద్దని సెక్యూరిటీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తాళాలు వేసిన సీళ్లను, గదిలో అమర్చిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన కలెక్టర్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట ఎలక్షన్ సూపరింటెండెంట్ బండ ప్రకాశ్, తహసీల్దార్ రాజ్‌కుమార్, డీటీ ప్రవీణ్, టెక్నికల్ సిబ్బంది ఉన్నారు.

5,555 మందితో మెగా రక్తదాన శిబిరం

- 13న పెద్దపల్లిలో నిర్వహణ
- డీసీపీ వైభవ్‌గైక్వాడ్



మాట్లాడుతున్న డీసీపీ వైభవ్‌గైక్వాడ్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం పెద్దపల్లిలో ఈనెల 13న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 5,555 మంది నుంచి రక్తాన్ని సేకరించాలనే లక్ష్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డీసీపీ వైభవ్‌గైక్వాడ్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి పట్టణంలో ఒకేరోజు రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన వారి నుంచి రక్తం సేకరించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో చేస్తున్నామని తెలిపారు. మెగా క్యాంపు విజయవంతం కోసం ఇప్పటికే యువత పేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. సేకరించిన రక్తాన్ని నిమ్స్, ఉస్మానియా, రెడ్‌క్రాస్‌సొసైటీల ద్వారా ఆసుపత్రులకు అందిస్తామన్నారు. పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ సారథ్యంలో సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులు రక్తదానంపై విస్తృత ప్రచారం కల్పిస్తూ అపోహలను తొలగించి రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు అనిల్, జగదీశ్, సత్యనారాయణ, ఎస్సై మహేందర్, రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్, శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు పీఆర్‌ఎస్‌ఈ ఆఫీస్‌ను ప్రారంభించనున్న మంత్రులు



పంచాయతీరాజ్ ఎస్‌ఈ ఆఫీసు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం పెద్దపల్లిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం ఏర్పాటవుతోంది. శుక్రవారం రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎరబెల్లి దయాకర్‌రావు, సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా కొత్తగా ఏర్పాటైన కార్యాలయానికి కరీంనగర్ ఎస్‌ఈ కనకరత్నం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని అధికారవర్గాలు తెలిపాయి.

ప్రభావిత ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చందర్, జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): ప్రభావిత ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సింగరేణి యాజమాన్యం ముందుకు వెళ్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. రూ.20లక్షలతో నిర్మించనున్న విఠల్‌నగర్, ఉదయ్‌నగర్, పవర్‌హౌజ్‌కాలనీలో మూడు ఆర్వోవాటర్ ప్లాంట్లు, జీఎం కాలనీలో రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, రూ.25లక్షలతో పవర్‌హౌజ్‌లో నిర్మించనున్న ఫిల్టర్ బెడ్ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సింగరేణి ప్రభావిత ప్రాంతాలు, ఉద్యోగులకు సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో వాటర్‌ప్లాంట్లు, రహదారుల నిర్మాణం చేపట్టారన్నారు. మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ర్యాపిడ్ గ్రావిటి సిస్టం ఏర్పాటుకు యాజమాన్యం నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ, జీడీకే-5 ఓసీపీ విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన ప్రభావిత, పరిసర గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా సింగరేణి ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, సీఎంఓఏఐ నాయకులు పొనగోటి శ్రీనివాస్, యూనియన్ నాయకులు గంద్ర దామోదర్‌రావు, మెండె శ్రీనివాస్, రంగు శ్రీనివాస్, సదానందం, ఆకుల హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదిరకాల నిత్యావసరాలు అందిస్తాం



ఉదయ్‌నగర్‌లో ఇంటింటా పర్యటిస్తున్న రాజ్‌ఠాగూర్, నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని(రామగుండం): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేషన్‌షాపుల ద్వారా తొమ్మిది రకాల నిత్యావసరాలు అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 7వ డివిజన్ ఉదయ్‌నగర్‌లో పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని, ఇళ్లు నిర్మించుకునే పేదలకు రూ.5లక్షలు ఇస్తామన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతు పెన్షన్ రూ.4వేలకు పెంచుతామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని, కుంభకోణాలు, భూదందాల్లో నాయకులు ఇరుక్కపోయి సామాన్య ప్రజలను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నజీముద్దీన్, ముస్తాఫా, కిరణ్, మనాలీఠాగూర్, బాదం వసంత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు పాటుపడాలి

రామగుండం: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ ఒక్క యువత పాటుపడాలని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్‌ఠాగూర్ అన్నారు. శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామానికి చెందిన యువత కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల ప్రతినిధులు పెండ్రు హన్మాన్‌రెడ్డి, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, గజెల్లి శంకర్, గజ్జెల నాగరాజు తదితరులున్నారు.

కొత్త రైతులకు బీమా చిక్కులు!

- నూతన రైతు కుటుంబాలకు బీమాలో జాప్యం
- వీరందరి పేరిట బీమా సంస్థకు ప్రీమియం కట్టిన ప్రభుత్వం
- అయినా కొత్త రైతుల పేరిట జనరేట్ కానీ ఇన్సూరెన్స్ ఐడీలు
- మరణించిన కొత్త రైతుకుటుంబాలకు బీమా చెల్లింపులో ఆలస్యం
- త్వరలో సమస్య పరిష్కారిస్తామంటున్న వ్యవసాయాధికారులు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లా కొత్త రైతు కుటుంబాలకు రైతుబీమాలో కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. ఇటీవల తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా విరాసత్ విధానంలో భూములు పొందిన వారికి, కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి రైతులుగా మారిన వారి కుటుంబాలను ఇన్సూరెన్స్ కష్టాలు వెంటాడుతున్నాయి. వాస్తవానికి రైతు అకాల మరణం చెందితే.. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు కేవలం రెండు వారాల్లో అంటే దాదాపు 14 రోజుల్లో రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం అందజేస్తుంది. ఇందుకు సంబంధించి ప్రీమియం బీమా సంస్థకు ఏటా ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ, 2022 ద్వితీయార్థంలో కొత్తగా భూములకు యజమానులుగా మారిన వారికి తాజాగా కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. వాస్తవానికి వీరందరినీ ప్రభుత్వం ఏనాడో యజమానులుగా గుర్తించింది. రైతు పేరిట పట్టాదారు పాసు పుస్తకం జారీ చేసి, ధరణిలో పేరు కూడా నమోదు చేసింది. కానీ, వీరికి ఇంతవరకూ ఇన్సూరెన్స్ ఐడీలు జనరేట్ కాకపోవడం గమనార్హం.

ఏంటీ సమస్య?

కొత్తగా వ్యవసాయ భూములకు యజమానులుగా మారిన రైతుల పేరిట ప్రభుత్వం బీమా సంస్థకు ఏటా ప్రీమియం చెల్లిస్తుంది. గతంలో బీమా సంస్థకు ప్రీమియం వివరాలు, రైతులకు సంబంధించి ఐడీని కాగితం రూపంలో రైతులకు అందజేసేవారు. ఏటా అదే ఐడీని రెన్యూవల్ చేసేవారు. రెండేళ్లుగా ఈ విధానం ఆన్‌లైన్ అయిపోయింది. దీంతో రైతుల ఇన్సూరెన్స్ వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు అవుతున్నాయి. రైతుకు అతడి పేరిట జనరేట్ అయిన ఐడీ నంబరు మాత్రం చెబుతున్నారు. ఒకవేళ ఆ రైతు ఆకస్మిక మరణం చెందితే.. సదరు ఐడీ ద్వారానే అతడి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము వస్తుంది. తాజాగా ప్రభుత్వం రైతు పేరిట బీమా ప్రీమియం చెల్లించినా.. వారికి ఐడీలు జనరేట్ కావడం లేదు. సాంకేతిక కారణాలతో ఇలా జరుగుతోందని సమాచారం. ఇలాంటి ఉదంతాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నాయి. బీమా సంస్థలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో రైతులకు ఇంకా ఐడీలు జనరేట్ కాలేదని సమాచారం.



గోనె కొమురయ్య(ఫైల్)

కల్వచర్లలో ఇలా..

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్లలో కొత్తగా భూమికి యజమానిగా మారిన గోనె కొముర‌య్య అనే రైతు పేరిట కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం ధరణిలో పేరునమోదు అయ్యింది. అనుకోకుండా కొమురయ్య ఆగస్టు 19న మరణించాడు. నిబంధనల ప్రకారం అతడి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును రెండు వారాల్లోగా అందజేయాలి. కానీ, మూడు వారాలు గడుస్తున్నా ఇంతవరకూ చెక్కు అందలేదని మృతుడి కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఇదేంటని ఆరా తీసిన గ్రామపెద్దలు.. అసలు కొమురయ్య పేరిట బీమా ఐడీ ఇంకా జనరేట్ కాలేదని తెలుసుకుని అవాక్కయ్యారు. కేవలం కొమురయ్యే కాదు.. కొత్త రైతులందరికీ ఇదే పరిస్థితి ఉందని తెలిసి ఆందోళన చెందుతన్నారు. అయితే, వ్యవసాయాధికారులు మాత్రం కంగారుపడాల్సింది ఏమీలేదని, కాస్త జాప్యమైనా బీమా సొమ్ము వస్తుందని భరోసా ఇస్తున్నారు.

పదుల కుటుంబాల ఎదురుచూపు..

కొత్తరైతులుగా నమోదై ఏడాదిలోగా మరణించిన రైతుల సంఖ్య కొత్త జిల్లాల వారీగా పదుల సంఖ్యలో పెండింగ్‌లో ఉందని సమాచారం. సిరిసిల్లలో ఐదుగురు, పెద్దపల్లిలో 32 మంది, కరీంనగర్‌లో సుమారు 10 కుటుంబాలు జగిత్యాలలో ఐదు కుటుంబాలు ఇలా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అదే సమయంలో అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు త్వరలోనే వీరికి పరిహారం అందజేస్తామని స్పష్టంచేస్తున్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రా బహుమతి స్వీకరించిన కవిత



నగదు బహుమతి అందుకుంటున్న కవిత

మంథని: రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీ మహిళా ప్రయాణికులకు ప్రోత్సాహంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో రెండో విజేతగా నిలిచిన మంథని మండలం సూరయ్యపల్లికి చెందిన జంజర్ల కవిత శుక్రవారం హైదరాబాద్ బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా రూ.15వేల నగదు అందుకుంది. కవిత తన సోదరుడికి రాఖీ కట్టేందుకు గత నెల 31న మంథని ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులో రామగిరి మండలం సెంటినరీకాలనీకి ప్రయాణించింది. ఈ నెల 5న తీసిన లక్కీ డ్రాలో ద్వితీయ విజేతగా నిలిచింది. కవిత, ఆమె భర్త రాజేందర్‌ను ఆర్టీసీ సొంత ఖర్చులతో హైదరాబాద్ పిలిపించి క్యాష్ అవార్డుతో పాటు సన్మానించడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న సుచరిత

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖకు చెందిన కౌన్సిలర్ సుచరిత అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని నారాయణపూర్, తొగర్రాయి గ్రామాల్లో జిల్లా నోడల్ అధికారి రౌఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండివారందరూ, 1 అక్టోబర్ 2023 నాటికి నిండబోయే యువతకు ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. మరణించిన వ్యక్తుల వివరాలు, గ్రామం వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి పేర్లు జాబితా నుంచి తొలగించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు పాటించాలన్నారు.

నేడు పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడి రాక

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం శాస్త్రినగర్‌కు శనివారం ఉదయం 10 గంటలకు పీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్య నిర్వహణ కార్యదర్శి కోట శ్రీనివాస్‌గౌడ్ రానున్నారు. మొదటిసారిగా జిల్లాకు వస్తున్నందున సుల్తానాబాద్‌లో స్వాగతం తెలిపేందుకు అభిమానులు, కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వర్ణకార సంఘం రద్దు

గోదావరిఖనిటౌన్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ ఏరియా స్వర్ణకార సంఘాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర స్వర్ణకార సంఘం నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు రాజు తెలిపారు. 2022లో జరిగిన సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా కందుకూరి నిరంజన్, ప్రధాన కార్యదర్శిగా కట్ట నగేశ్‌కుమార్ వేర్వేరు ప్యానల్ నుంచి గెలుపొందారని, అప్పటి నుంచి వీరిద్దరి మధ్య సఖ్యత కుదరడం లేదన్నారు. సంఘం కార్యక్రమాల్లో అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిని కలుపుకుపోకుండా సొంత నిర్ణయాలు తీసుకున్నట్లు రాష్ట్ర సంఘానికి తెలియడంతో గతంలో మందలించారని, అయినా అధ్యక్షుడి తీరు మారకపోవడంతో కార్పొరేషన్ సంఘం బాడీని రద్దు చేస్తూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. 3 నెలల్లో నూతన సంఘానికి ఎన్నికలు జరుగుతాయని, అప్పటి వరకు సంఘం పేరుమీద ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడానికి వారికి హక్కు లేదని వివరించారు.

మానసిక వేదనతో వృద్ధురాలి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన పెర్క కనకమ్మ(62)ను ఆస్తి కోసం వేధించడం వల్లే మానసిక వేదనకు గురై మృతిచెందిందని ఆమె బంధువు పెర్క రాయమల్లు ఫిర్యాదు చేశాడని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో కనకమ్మ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. రాయమల్లు ఫిర్యాదు మేరకు మృతురాలి చెల్లె కూతురు చంద పద్మ, ఆమె కుమారులు శ్రీకాంత్, శ్రావణ్‌లపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లా వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, అందుకనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మండపాల నిర్వహణ, నిమజ్జనం ఏర్పాట్లపై అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీసీపీ వైభవ్‌గైక్వాడ్‌తో కలిసి సమీక్షించారు. అన్ని మండలాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసే గణేశ్‌మండప నిర్వాహకులు అధికారుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు స్థానికంగా సమావేశమై ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణపతి ఉత్సవాల సందర్భంగా గట్టి నిఘా ఉంటుందని, వివాదాలు సృష్టిస్తేందుకు యత్నించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని డీసీపీ పేర్కొన్నారు. ఆర్డీఓలు మధుమోహన్, హనుమనాయక్, ఏటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డీసీపీ వైభవ్‌గైక్వాడ్‌తో కలిసి మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణకు చేపట్టిన చర్యలపై సమీక్షించారు. యువత వ్యసనాలకు లోనై తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు, రవాణా జరగకుండా చూడాలన్నారు. బెల్టుషాపులపై ఫిర్యాదులందితే మూసివేయించి చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో దగా

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు



మాట్లాడుతున్న విజయరమణారావు

జూలపల్లి(పెద్దపల్లి): పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని ఆశపెట్టిన ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వకుండా దగా చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో గృహలక్ష్మి దరఖాస్తులు సమర్పించని నిరుపేదలతో జూలపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వెయ్యికి పైగా దరఖాస్తులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం షాపులకు 20 రోజులు గడువిచ్చి, గృహలక్ష్మి దరఖాస్తులను తీసుకునేందుకు మూడు రోజులు గడువు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.500 కే గ్యాస్ సిలిండర్, అన్నదాతలకు రూ.2లక్ష ల రుణమాఫీ, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు నిర్ణయించినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య, సుల్తానాబాద్ జెడ్పీటీసీ ప్రకాశ్‌రావు, నాయకులు దామోదర్‌రావు, మసూద్, మెతుకు కాంతయ్య, సంతోశ్, బండి స్వామి, కొమ్మ పోచాలు, సామ రాజేశ్వర్‌రెడ్డి, అంజయ్య, లింగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి సీఎస్సీ తోడ్పాటు



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణరావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి సీఎస్సీ(కామన్ సర్వీస్ సెంటర్) తోడ్పాటునిస్తుందని కేడీసీసీ సీఈవో సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎస్సీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు, రైతులకు, వ్యాపారులకు ఉపయోగకరంగా ఉండేందుకు 128 పీఏసీఎస్‌లు ఉండగా ప్రస్తుతం 115 సంఘాల్లో సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. పీఏసీఎస్‌లలో సీఎస్సీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్తులో ఎల్పీజీ కనెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 35 సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, త్వరలో 300 సేవలు అందుబాటులో ఉండేలా చొరవ తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, విండో అధికారులు అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, కార్యదర్శి బూర్గు సంతోష్‌కుమార్, శ్యామ్, మహేష్, రాజు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోల్‌సిటీ(రామగుండం): పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రామగుండం నగరపాలక కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు వై.యాకయ్య మాట్లాడుతూ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, జనరల్ ఫండ్ నుంచి కాకుండా మున్సిపల్ ట్రెజరర్ నుంచి జీతాలు ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మికులకు ప్రమాద బీమా రూ.25 లక్షలు చెల్లించాలని, ఎవరైనా కార్మికుడు వయస్సు పైబడి పని చేయకుంటే వారి కుటుంబం నుంచి ఒకరిని పనికి తీసుకోవాలని పేర్కొన్నారు. పండుగలకు, ఆదివారాలు సెలవులు ఇవ్వాలని, స్వచ్ఛ కార్మికులను కూడా మున్సిపల్ కార్మికులుగా గుర్తించి ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్టు రూ.21,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్‌ను కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. పనిముట్లతోపాటు బట్టలు, చెప్పులు, సబ్బులు, పండగ సెలవులు తదితర వాటిపై జాప్యం లేకుండా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఉప్పులేటి రాధాకృష్ణ, కోశాధికారి సారయ్య, ఉపాధ్యక్షుడు బోయిన్ రవీందర్, రాష్ట్ర మహిళా కన్వీనర్ నాగమణి, రమణ, సమేజా, నరసమ్మ, సంతోష్, సాగర్, విజయ్, జావీద్, వెంకటస్వామి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి బీజేపీ టికెట్‌కు దరఖాస్తు

పెద్దపల్లిరూరల్/జూలపల్లి: పెద్దపల్లి అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిత్వాన్ని తనకే ఇచ్చి పోటీ చేసే అవకాశం కల్పించాలంటూ నియోజకవర్గ పరిధిలోని జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన జీకే శేఖర్‌యాదవ్ శుక్రవారం పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో యాదవ సామాజికవర్గం బలంగా ఉందని, పార్టీ అధిష్టానం పోటీ చేసే అవకాశం ఇస్తే గెలుపు సులువవుతుందన్నారు.

సుల్తానాబాద్ నుంచి మరొకరు..

సుల్తానాబాద్: పెద్దపల్లి అసెంబ్లీ బీజేపీ టికెట్‌కు శుక్రవారం హైదరాబాద్‌లో దరఖాస్తు చేసినట్లు ఏగోలపు కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏగోలపు సదయ్యగౌడ్ తెలిపారు. ఆయన వెంట ఎర్రం సంతోష్‌రెడ్డి, బుర్ర సతీష్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బత్తిని పర్శరామ్‌గౌడ్, వేగోళం కిరణ్‌గౌడ్, ఇల్లందుల అంజిగౌడ్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

జూలపల్లి(పెద్దపల్లి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు చైతన్యమై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సునీత సూచించారు. మండల కేంద్రంలోని వెలుగు సమాఖ్య కార్యాలయంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షురాళ్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం ఎస్సై వెంకటకృష్ణ మాట్లాడుతూ, ఈనెల 13న పెద్దపల్లిలో పోలీసు శాఖ తరఫున నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో మహిళలు కూడా రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం రవి, ఏపీఎం సుధాకర్, సీసీలు జ్యోతి, రవి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మిని ఆమె భర్తే చంపాడు

- గొంతునులిమి హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరణ
- అరెస్టు చేసిన పోలీసులు



వరుణ్‌కుమార్-వరలక్ష్మి దంపతులు (ఫైల్)

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని సాయిబాలాజీనగర్‌లో ఉంటున్న వరలక్ష్మి(33)ని ఆమె భర్తే చంపినట్లు త్రీటౌన్ పోలీసులు తేల్చారు. అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండం మండలంలోని వీర్లపల్లికి చెందిన వరలక్ష్మికి, సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లికి చెందిన సుత్రాల వరుణ్‌కుమార్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. అతను ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబసభ్యులతో కలిసి కరీంనగర్‌లోని సాయిబాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. వరుణ్‌కుమార్ మద్యానికి బానిసై, తన ఆస్తులు కరిగించేశాడు. చివరకు భార్య నగలు కూడా తాకట్టు పెట్టాడు. నిత్యం మద్యం మత్తులో భార్యతో గొడవపడుతూ, హింసించేవాడు. ఈ నెల 5న రాత్రి దంపతుల మధ్య నగలు విడిపించే విషయంలో గొడవ జరిగింది. దీంతో వరుణ్‌కుమార్ కోపోద్రిక్తుడై, ఆమెను గొంతునులిమి చంపేశాడు. అనంతరం ఫ్యాన్‌కు ఉరేసి, ఆత్మహత్యగా చిత్రీకరించాడు. వరలక్ష్మి మృతిపై అనుమానం ఉందని, ఆమెను భర్తే హత్య చేశాడని, ఇందుకు అతని కుటుంబసభ్యులు సహకరించారని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో వరుణ్‌కుమార్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. శుక్రవారం అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసును త్వరగా ఛేదించిన త్రీటౌన్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను రూ.26వేలకు పెంచాలని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. పెద్దపల్లి మున్సిపల్ ఆఫీసు ఎదుట కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 12న ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామన్నారు. ఈనెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలన్నారు. నాయకులు చంద్రయ్య, కొమురయ్య, సతీష్, నర్సయ్య, శ్రీనివాస్, సురేశ్, పద్మ, ప్రమీల, సుశీల, లక్ష్మి, రాజయ్య, భూమయ్య పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్(పెద్దపల్లి): మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాక మహేశ్, జిల్లా కార్యదర్శి శ్రావణపల్లి వెంకటస్వామి కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కనీస వేతనం నెలకు రూ.21,000 ఇస్తుండగా, ధనిక రాష్ట్రం తెలంగాణలో కేవలం రూ.16,600 మాత్రమే ఇస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ నెల 30న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి అన్ని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామ్మూర్తి, లక్ష్మి, రాజేశ్వరి, ఓదెలు, మహేశ్, మధు, సురేశ్, మల్లేశ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో పాలకులు విఫలం



నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతున్నాయని, ధరల నియంత్రణలో పాలకులు విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య ఆరోపించారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. దేశంలో నిత్యావసర ధరలకు అడ్డూఅదుపులేకుండా పోయిందన్నారు. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడంలోనూ పాలకులు దారుణంగా విఫలమయ్యారని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో ధరలు మూడు రెట్లు పెరిగాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు అర్ధాకలితో అలమటించాల్సిన పరిస్థితులున్నాయన్నారు. ప్రభుత్వాలు ధరలను నియంత్రించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. నాయకులు ముత్యంరావు, కుమారస్వామి, మహేశ్వరి, రవీందర్, బూడిద గణేశ్, అశోక్, దిలీప్, సాగర్, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి డైరెక్టర్లు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): భూగర్భగనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచాలని సింగరేణి డైరెక్టర్లు జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్వీకే శ్రీనివాస్ దిశానిర్దేశం చేశారు. శుక్రవారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. భూగర్భ గనుల్లో పూర్తిస్థాయి యంత్రాల వినియోగం పెంచాలన్నారు. షిఫ్టుల వారీగా భూగర్భ గనుల్లో మ్యాన్‌పవర్ గురించి తెలుసుకున్నారు. రక్షణ చర్యలు తదితర అంశాలపై చర్చించారు. కాన్ఫరెన్స్‌లో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఏరియ ఇంజినీర్ రామ్మూర్తి, ఓసీ-5 ప్రాజెక్ట్ అధికారి కె.చంద్రశేఖర్, ఏజెంట్ చిలక శ్రీనివాస్, బానోతు సైదులు, ఏజీఎం ఐఈడీ ఆంజనేయులు, క్వాలిటీ డీజీఎం శ్రీధర్, మేనేజర్లు నెహ్రూ, రమేష్‌బాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వకీల్‌పల్లిగనిలో..

రామగుండం డివిజన్-2 వకీల్‌పల్లిగనిలో బొగ్గు ఉత్పత్తి పెంచాలని డైరెక్టర్లు సూచించారు. శుక్రవారం ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డైరెక్టర్లు మాట్లాడారు. ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లి భూగర్భగనుల్లో ఉన్న యంత్రాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ఎల్‌హెచ్‌డీ, ఎస్‌డీఎల్, కంటిన్యూస్ మైనర్‌యంత్రాల పనితీరు మరింత మెరుగుపర్చాలన్నారు. వకీల్‌పల్లిగని ఆగస్టులో 119శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడంపై అభినందించారు. కాన్ఫరెన్స్‌లో ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఇన్‌చార్జి మేనేజర్ తిరుపతి, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ, రక్షణ ఉత్పత్తికి సోపానాలు

- ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): రక్షణ, క్రమశిక్షణ ఉత్పత్తికి మెరుగైన సోపానాలు అని ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంతకముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భారీ యంత్రాల వద్ద పని చేసే క్రమంలో సూచించిన రక్షణ విధానాలను పాటించాలన్నారు. ప్రమాదాలు తగ్గించేందుకు సురక్షితమైన పని విధానాలు, రక్షణ సూత్రాల అమలు, రక్షణ పరికరాలు వినియోగించడం, సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలు తదితర అంశాలు బొగ్గు ఉత్పత్తిని సాధించడానికి తోడ్పడుతాయని పేర్కొన్నారు. ఇంటి నుంచి బయలుదేరే సమయం నుంచే రక్షణ ఉండాలన్నారు. అనంతరం ఉద్యోగులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞ చేశారు. జీఎం వెంట ప్రాజెక్టు అధికారి మధుసూదన్, డీజీఎం పర్సనల్ రాజేంద్ర ప్రసాద్, ఓసీపీ-3 మేనేజర్ డి.రమేష్, సేఫ్టీ అధికారి భరత్‌కుమార్, సంక్షేమాధికారి సురేందర్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహమ్మద్, ఫిట్ సెక్రెటరీ కొంగర రవీందర్, చర్చల కమిటీ నాయకుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకలజనుల సమ్మె చరిత్రాత్మకం



మాట్లాడుతున్న కెంగర్ల మల్లయ్య

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): నాడు తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన సకలజనుల సమ్మె చరిత్రాత్మకమైనదని సకలజనుల సమ్మె స్ఫూర్తి నిర్వహణ కమిటీ (జేఏసీ) కన్వీనర్ కెంగర్ల మల్లయ్య అన్నారు. శుక్రవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. తెలంగాణ సాధనకు అన్ని వర్గాల ప్రజలతో పాటు సింగరేణి కార్మికులు సైతం సమ్మెలో పాల్గొనడం జరిగిందన్నారు. సకలజనుల సమ్మె చేపట్టి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 13న గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో సకలజనుల స్ఫూర్తిదాయక సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభకు ముఖ్య అతిథులుగా మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రముఖ గాయకుడు దేశపతి శ్రీనివాస్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సింగరేణి కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రామ్మూర్తి, సుధాకర్‌రావు, శ్రీనివాస్, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

రామగిరి(మంథని): అకారణంగా తమను విధుల నుంచి తొలగించారని శుక్రవారం ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు సాగర్, కొమురయ్య నిరసన చేపట్టారు. గతంలో స్విమ్మింగ్ పూల్‌లో విధులు నిర్వహించినప్పుడు అప్పటి కాంట్రాక్టర్ వేతనాలు సరిగా చెల్లించడం లేదని ఆయా యూనియన్‌ల నుంచి యాజమాన్యాలకు లేఖలు పంపించినందుకు కక్ష గట్టి విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. విధుల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని, యాజమాన్యం వెంటనే స్పందించి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

కార్మికులకు ఒకే దఫా ఏరియర్స్ చెల్లించాలి



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రామగిరి(మంథని): 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ కోల్ ఇండియాలో చెల్లించిన విధంగా సింగరేణిలో కూడా ఒకే దఫాలో చెల్లించాలని ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కె.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జీఎం కార్యాలయం ఎదుట ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. టీబీజీకేఎస్, యాజమాన్యం లోపాయికారి ఒప్పందం చేసుకొని ఏరియర్స్ పట్ల సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికులకు వెంటనే ఏరియర్స్ చెల్లించి, లాభాల వాటా 35 శాతం ప్రకటించాలని లేకుంటే ఏఐటీయూసీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వైవీ రావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, డీటీ రావు, సమ్మయ్య, కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-1, 2 ఏరియాల్లో..

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ-1 జీఎం ఆఫీస్ ఎదుట చేపట్టిన దీక్షలో నాయకులు రాజ్‌కుమార్, ఎల్లాగౌడ్, నా రాయణ, కె.స్వామి, ఆరెల్లి పోషం, మాదన మ హేశ్, సంకె అశోక్, ఎస్.వెంకట్‌రెడ్డి, బోగ సతీశ్‌బా బు, దొంత సాయన్న, మిట్ట శంకర్, చెప్యాల భాస్కర్, గౌతం గోవర్ధన్, కనకరాజ్ పాల్గొన్నారు. ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ముందు చేపట్టిన నిరాహార దీక్షలో వైవీరావు, ఎల్.ప్రకాశ్, రాజరత్నం, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన



డోనర్‌కార్డు చూపిస్తున్న యువ ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ఆర్జీ-2 ఏరియా ఎంవీటీసీ సెంటర్‌లో శుక్రవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, శరీర, అవయవ దానాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ సలహాదారు నూక రమేశ్ మాట్లాడుతూ, మానవ శరీరంలో ఉన్న అవయవాలు మనిషి మరణించిన తర్వాత కోట్లు ఖర్చుపెట్టినా దొరకనివి మట్టిలో కలిసిపోకుండా సమాజహితం కోసం ఇతరులకు ఉపయోగపడేలా దానం చేయాలని సూచించారు. ఈమేరకు సింగరేణి యవ కార్మికులు నేత్ర, శరీర అవయవ దానాలకు ముందుకు రాగా వారికి డోనర్ కార్డులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంవీటీసీ అధికారులు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

10న బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ అత్యవసర సమావేశం ఈనెల 10న మందమర్రి ఏరియా సీఈఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రావు, కేంద్ర కమిటీ సభ్యుడు శంకర్‌నాయక్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సెంట్రల్ కమిటీ సభ్యులు, 11 ఏరియాల్లో ఉన్న అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాత్రమే హాజరుకావాలని సూచించారు. చీఫ్ లైజాన్ ఆఫీసర్, 11 ఏరియాల లైజాన్ ఆఫీసర్స్ కూడా హాజరై కమిటీ పని తీరును పరిశీలించాలని సంఘం బాధ్యులు కోరారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మంథని: మంథని, ముత్తారం మండలానికి చెందిన పలువురు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంథని మండలం సూరయ్యపల్లికి చెందిన 30 మంది, ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి జెడ్పీచైర్మన్ పుట్ట మధు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గ్రామాల్లో స్వచ్ఛ శుక్రవారం



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ కావేరి

ఎలిగేడు: మండలంలోని గ్రామాల్లో గ్రామగ్రామాన స్వచ్ఛ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయా గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పలు వీధుల్లో తిరుగుతూ పంచాయతీ సిబ్బందితో చెత్తను తొలగించి, నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. హరితహారంలో నాటిన మొక్కలను, పల్లెప్రకృతివనాలను పరిశీలించారు.

అవయవదానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం సదాశయ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నేత్ర, శరీరం, అవయవదానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మేరుగు భీష్మాచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మరణానంతరం నేత్రాలను దానం చేసి కార్నియల్ అంధత్వరహిత రాష్ట్రం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంస్థ ప్రతినిధులు కె.శ్రీనివాస్, భువనగిరి రాజు, క్యాతం మల్లేషం, బోగోజు అశోక్ నేత్ర, అవయవ, శరీరదానాల గురించి అవగాహన కల్పించారు. ఫౌండేషన్ మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోన్‌యాప్‌ల జోలికి వెళ్లొద్దు



మాట్లాడుతున్న ఎస్సై మహేందర్

పెద్దపల్లిరూరల్: యువత, ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు లోన్‌యాప్‌ల జోలికి వెళ్లొద్దని, ఆ యాప్‌లను వినియోగించి ఆర్థికంగా నష్టపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఎస్సై మహేందర్ అన్నారు. స్థానిక ట్రినిటీ డిగ్రీ, పీజీ కాలేజీలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్‌నేరాల నుంచి బయటపడేందుకు అనుసరించాల్సిన మార్గాలపై అవగాహన కల్పించారు. ఏ రకమైన ఇబ్బంది ఎదురైనా వెంటనే 100 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ఈనెల 13న నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలు కావాలన్నారు. ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశ్విని, వలంటీర్లు, విద్యార్థులు ఉన్నారు.

వంటపాత్రలు అందజేత

జ్యోతినగర్: శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం హనుమాన్ దీక్షలో ఉన్న స్వామలకు బిక్ష కోసం వంటపాత్రలను అందించారు. ఎన్టీపీసీ రామగుండం టౌన్‌షిప్ రింగ్‌రోడ్ సమీపంలోని ఆలయ ఆవరణలో శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకులు సోమారపు లావణ్య-అరుణ్‌కుమార్ సౌజన్యంతో డబుల్ బర్నర్ గ్యాస్ స్టవ్, 200 మందికి వంట తయారు చేసేందుకు అవసరమైన వంట పాత్రలను సాగి కిషన్‌రావు, లక్ష్మీనారాయణ చేతుల మీదుగా హనుమాన్ దీక్ష స్వాములకు అందించారు.

ప్రమాదకరంగా సర్వీస్‌రోడ్డు

- రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం, పక్కనే ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని అధికారులు



రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం, పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

జ్యోతినగర్: రాజీవ్ రహదారికి పూర్తిస్థాయిలో సర్వీసు రోడ్లు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దీంతో పలువురు గాయాలపాలవుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. కమిషనరేట్ ఎదుట ఉన్న సర్వీసు రోడ్డుపక్కన వరద కాలువ ఉన్నప్పటికీ దానికి సైడ్ గ్రిల్ లేకపోవడంతో గతంలో ఒక కారు దానిలో పడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే మల్కాపూర్ రోడ్ వద్ద సర్వీసు రోడ్డు మెయిన్ రోడ్డుకు వెళ్లే దారి అస్తవ్యస్తంగా ఉంది. ముళ్ల పొదలతో పాటు రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం , దానిపక్కనే ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నాయి. రాత్రి సమయంలో ఈ దారి గుండా వచ్చే వారు చీకటిలో సరిగా కనిపించక ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు..

ప్రతిరోజూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల బారి నుంచి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించే సంబంధిత అధికారులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలపై దృష్టిసారించి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ రహదారి మల్కాపూర్ క్రాస్‌రోడ్ వద్ద చాలా ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయి.

స్తంభాన్ని తొలగించాలి



కమిషనరేట్ సర్వీసు రోడ్డు మల్కాపూర్ క్రాస్‌రోడ్ మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాన్ని తొలగించాలి. వాటిని తొలగించే దాకా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి. పూర్తిస్థాయిలో సర్వీసు రోడ్డును నిర్మించి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి.

– అబ్దుల్లా, కాంగ్రెస్ నాయకుడు

సైడ్ గ్రిల్ ఏర్పాటు చేయాలి



రాజీవ్ రహదారి సర్వీసు రోడ్డు పక్కన ఉన్న వరద కాలువకు సైడ్ గ్రిల్ ఏర్పాటు చేయాలి. కాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వరద నీరు మల్కాపూర్ రోడ్డుపై చేరడంతో దారి మొత్తం గుంతలుగా మారింది. రాజీవ్ రహదారి నుంచి మల్కాపూర్ బోర్డు వరకు రోడ్డును వెడల్పు చేసి, కొత్త రోడ్డును నిర్మించాలి.

– సురేశ్, మల్కాపూర్

‘రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలవుదాం’



మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్

పాలకుర్తి: పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పెద్దపల్లి సీఐ.అనిల్‌కుమార్ కోరారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులనుద్దేశించి మాట్లాడారు. నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాల్లో సరైన సమయంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, సకాలంలో వారికి రక్తందానం చేస్తే ప్రాణబిక్ష పెట్టినవాళ్లం అవుతామన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఉదయం 7గంటల నుంచి రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు. బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్, కేశోరాం సేఫ్టీ అధికారి మల్లికార్జున్‌తో పాటు పోలీస్‌సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



పూజల్లో భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పవన్ మహరాజ్ మహిళలతో కుంకుమార్చన పూజ చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గండి వసంతలక్ష్మి-సదానందం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

రామగుండం: శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ నేపథ్యంలో వేకువజాము నుంచి శ్రీసంతోషిమాతకు ప్రత్యేక పూజల్లో భాగంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించడంతో పాటు ఉద్దీపణ పూజలు చేశారు. పూజకు పొరుగు జిల్లాల నుంచి మహిళా భక్తులు తరలివచ్చారు. ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్‌శర్మతో పాటు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సీఎం కేసీఆర్‌వి మోసపూరిత హామీలు



వినతిపత్రం అందుకుంటున్న గుజ్జుల

పెద్దపల్లిరూరల్: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ అధికార పీఠమెక్కాక ఆ హామీనే మర్చిపోయారని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనాలందడం లేదని, ఒక్కో ప్రాంతంలో ఒక్కోవిధంగా వేతనాలు చెల్లిస్తూ మోసగిస్తున్నారని విమర్శించారు. న్యాయమైన సమస్యల సాధనకు నిరసన దీక్షలు చేపట్టినా ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు పర్శ సమ్మయ్య, పల్లె సదానందం, వెల్లంపల్లి శ్రీనివాసరావు, పెండ్యాల కుమార్ ఉన్నారు.

ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

పెద్దపల్లిరూరల్: నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాల్సిందేనని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ మక్కాన్‌సింగ్ డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో శుక్రవారం ఆయన దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. వైఎస్సార్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఆరోగ్యమిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులపై సీఎం కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తామన్నారు. నాయకులు రాజిరెడ్డి, విజయ్‌కుమార్, సాయి ఉన్నారు.

బాల్యమిత్రుడి కూతురు వివాహంలో శివారెడ్డి



చీర బహూకరిస్తున్న శివారెడ్డి

రామగుండం: సినీ, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి తన బాల్యమిత్రుడు లగిశెట్టి రామచంద్రం కూతురు భారతి వివాహానికి శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని మద్దిర్యాల గ్రామంలో నిర్వహిస్తున్న వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా శివారెడ్డి గ్రామానికి చేరుకోవడంతో వేడుక ప్రాంగణంతో పాటు గ్రామంలోని వందలాది మంది ఆయనతో సెల్ఫీలు దిగారు.

ఫోర్‌లేన్ రోడ్లను శుభ్రం చేస్తున్న హెచ్‌కేఆర్



హైవే పక్కన పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ: ఎట్టకేలకు రాజీవ్ ఫోర్‌లేన్ రోడ్లను శుభ్రం చేయడానికి హెచ్‌కేఆర్ అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్లపై పేరుకుపోయిన మట్టి, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని హైవే రోడ్లపై మట్టిని తొలగించిన సిబ్బంది, రోడ్ల పక్కన ఎత్తుగా పెరిగిన మొక్కలను కొట్టివేశారు. పనులను హెచ్‌కేఆర్ బసంత్‌నగర్ టోల్‌ప్లాజా ప్రతినిధి నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

మంథనిలో ఎరువుల దుకాణాలు తనిఖీ



స్టాక్ నమోదు చేస్తున్న ఇన్‌చార్జి ఏవో

మంథని: మంథనిలోని పలు ఎరువుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, డీసీఎంఎస్‌లో ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి శ్రీకాంత్ తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు ఉంటాయన్నారు.

గ్రామాల్లో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జూలపల్లి: మండలంలోని కాచాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు సంతోష్‌రావు, ఎల్లయ్య, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో కిరణ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభలు

ముత్తారం: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై 10 నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ సభలు జరుగుతాయని ఉపాధిహామీ ఏపీవో దయమణి తెలిపారు. 10న ఇప్పలపల్లి, మైదంబండ, 11న అడవిశ్రీరాంపూర్, కేశనపల్లి, మచ్చుపేట, ఖమ్మంపల్లి, పారుపల్లిలో మొదటి ఫేస్‌లో సోషల్ ఆడిట్ జరుగుతుందని ఏపీవో చెప్పారు. అలాగే 14న ధర్యపూర్, ఓడేడ్, సీతంపేట, లక్కారం, పోతారం, 15న ముత్తారం, హరిపురంలో గ్రామసభలు జరుగుతాయని ఆమె వివరించారు. సామాజిక తనిఖీ మండల సభ 16న జరుగుతుందని పేర్కొన్నారు.

ఆలయంలో వేంకటేశ్వరస్వామి నామస్మరణ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు వేంకటేశ్వరస్వామి నామస్మరణ చేశారు. ప్రతి ఏడాది భక్తులు ఆలయం చేరుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భజన, సంకీర్తన నామస్మరణ చేస్తారు.

బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైన గోటికార్ కిషన్‌ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. తోకల మల్లేశ్, ఆర్ల నాగరాజు, పుల్లె కృష్ణ తదితరులు ఉన్నారు.

సమాచారం

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని రాగినేడు, బొంపల్లి, తుర్కలమద్దికుంట, పాలితంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. ఆయా ప్రాంతాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంథని పరిధిలో..

మంథని: మంథనితో పాటు పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మంథని, రూరల్ ఏఈలు మల్లయ్య, శ్రీనివాస్ తెలిపారు. మంథని, గుంజపడుగు, నాగారం వెంకటాపూర్, ఎక్లాస్‌పూర్, బిట్టుపల్లి, గోపాల్‌పూర్ విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ముత్తారం మండలంలో..

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్, లక్కారం, ముత్తారం, ఖమ్మంపల్లిలో విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. రెండో శనివారం విద్యుత్ మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి 10 వరకు సరఫరా ఉండదని అధికారులు పేర్కొన్నారు.

రామగుండం పరిధిలో..

రామగుండం: రామగుండం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు నేపథ్యంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ బేతి దామోదర్‌రావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మల్యాలపల్లి, బద్రిపల్లి, కుందనపల్లి, మొగల్‌పహాడ్, కుందనపల్లి, అక్బర్‌నగర్, రైల్వేస్టేషన్ ఏరియా, విద్యుత్‌నగర్, అయోధ్యనగర్, జీరోపాయింట్, హౌజింగ్‌బోర్డు కాలనీ, లింగాపూర్, అబాది రామగుండం, సండే మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, రొంపికుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

19వ తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశం



రామగుండం: అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

కమాన్‌పూర్: ఈనెల19వ తేదీ వరకు ఓటరు నమోదు, ఓటరు జాబితాలో అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తహశీల్దార్ వంగల మోహన్‌రెడ్డి తెలపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వీవో సంఘాల మహిళలకు ఓటుహక్కుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలో 500పైగా 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోలేదన్నారు. ఓటరు జాబితాల్లో నమోదైన ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏపీఎం శైలజశాంతి, ఎంపీవో శేషయ్యసూరి పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతపై అవగాహన

రామగుండం: ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కుకు అర్హత తదితర అంశాలపై శుక్రవారం అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు తహశీల్దార్ పి.రామ్మోహన్‌రావు అవగాహన కల్పించారు. ఓటరుగా నమోదు, తప్పుల సవరణ తదితర అంశాలకు వినియోగించే ఫారాల గురించి వివరించారు. హైస్కూల్ హెచ్ఎం ఇరుగురాల ఓదెలు ఉన్నారు.

అవగాహన సదస్సు

ఓదెల: మండలంలోని ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లోని పాఠశాలలు, కస్తూర్బా విద్యార్థులకు తహశీల్దార్ యాకన్న ఓటునమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఓ జ్యోతి, ప్రధానోపాధ్యాయులు శోభారాణి పాల్గొన్నారు.

ఎలక్ట్రానింగ్ ఓటింగ్‌పై..

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో ఎలక్ట్రానింగ్ ఓటింగ్ వేసే విధానంపై ఏఈవో శ్రీనివాస్, సర్పంచ్ లావణ్యతో కలసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ మిషన్ (ఈవీఎం)ల పని తీరును వివరించారు. సమ్మయ్య, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై రవిప్రసాద్

రామగిరి: ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎస్సై రవిప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగల సమయంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఒకరి మతాన్ని ఇంకొకరు గౌరవించుకోవాలని కోరారు. చట్టాన్ని గౌరవిస్తూ, ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, పోలీసులకు సహకరిస్తూ పండుగలు జరుపుకోవాలని సూచించారు. ఏమైనా సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పీస్ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక సంఘాల ఆధ్వర్యంలో మల్టీసేవలు

సుల్తానాబాద్‌రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో మల్టీ సేవలను ఇప్పటికే అందిస్తున్నామని, రాబోయో రోజుల్లో సంఘాల నుంచి సేవలు అందేలా రూపకల్పన చేస్తున్నామని కేడీసీసీ బ్యాంక్ సీఈఓ సత్యనారాయణరావు తెలిపారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ)ను ఎంపీపీ బాలాజీరావుతో కలిసి సీఈఓ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో రైతులకు, కామన్ ప్రజలకు కూడా అన్నివిధాలా సేవలు అందించేందుకు ఇక నుంచి సంఘాలను బలోపేతనం చేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ దేవరనేని మోహన్‌రావు, సర్పంచ్ రమేశ్, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ శశిధర్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్, వైస్‌చైర్మన్ రాజు, డైరెక్టర్లు సత్తయ్య, లింగయ్య, మాధవరావు, నిర్మల, శంకర్, నారాయణ, కార్యదర్శి రమేశ్, పాల్గొన్నారు.

రోగులకు అసౌకర్యం కలగకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని ఎంపీపీ బాలాజీరావు సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవల విభాగాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉన్నందున, వాటిని అదుపు చేసేందుకు, రోగులకు వైద్యసేవలు అందించేందు కు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నా రు. పలు గ్రామాల్లో ఇప్పటికే డెంగీ లక్షణాలతో అధిక మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వాటిని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందిపై ఉందన్నారు.

బహుజనులంతా ఏకం కావాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారంతా ఏకమైతే బహుజన రాజ్యం సాధించడం ఖాయమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం పలు పార్టీలకు చెందిన నాయకులు ఓదెలకు చెందిన బోగె సదానందం, బీరం రవీందర్ సారథ్యంలో పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ సాగిస్తున్న మోసపూరిత పాలనకు ప్రజలంతా విసుగుచెందారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి ఖాయమన్నారు. నాయకులు పోలు, రాజయ్య, సదానందం, సంపత్, కుమార్, శంకర్, సాయిలు, పోచాలు ఉన్నారు.